

రక్తదానం మహా ప్రాణదానం: కలెక్టర్



ప్రజాశక్తి- జీడీ నెల్లూరు: రక్తదానం మహా ప్రాణదానమని, రక్తదానం చేయడం వలన ఆరోగ్యం బాగుండటంతోపాటు ప్రమాదాల బారిన పడిన వారికి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చు అని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మెగా స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం జీడీ నెల్లూరు మండలం, సుందరరాజపురంలో విజయం విద్యాసంస్థలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం, వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జీడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే , ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ విఎం థామస్‌తో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఒక మనిషికి ప్రాణదానం చేసిన వారు అవుతారని, ప్రస్తుత సమాజంలో వివిధ రకాల జబ్బులు, ప్రమాదాల్లో గాయపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరం అవుతుందని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితికి ఎదగాలని, ఉన్నత విలువలు, భావాలతో జీవనం సాగిస్తూ సమాజ హితం కోరి సేవాభావంతో ముందుకెళ్లాలని, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. విజయం విద్యాసంస్థల అధినేతలు సమాజసేవలో భాగస్వాములై స్వచ్ఛంద రక్తదాన శిబిరాలతో పాటు అనేక సమాజ సేవా కార్యక్రమలలో భాగస్వాములు కావడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలోనే ఉత్తమ సేవలనందించిన విద్యా సంస్థ సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డును రాష్ట్ర గవర్నర్ ద్వారా పొందాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే సేవాతత్పరత, నాయకత్వ లక్షణాలతో ఉన్నత స్థితికి ఎదగాలని, చెడు అలవాట్లకు బలికాకుండా ఆరోగ్యవంతమైన సమసమాజం కోసం కృషి చేయాలని అన్నారు. విజయం విద్యాసంస్థలు వారు 32సార్లు మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతోమందికి ప్రాణదానం చేసిన వారైనారని విద్యాసంస్థల అధినేతలను, విద్యార్థులను అభినందించారు. ఈశిబిరంలో డిగ్రీ, ఎంబీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇందులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చిత్తూరు జిల్లా శాఖ చైర్మన్ రమేష్ బాబు, విజయం విద్యాసంస్థల అధినేతలు తేజోమూర్తి, శైలజ, కళాశాలల ఏఓ రాజగోపాల నాయుడు, విజయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి, బిజినెస్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జయంత్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవేంద్రన్, పెనుమూరుమార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, యువ నాయకుడు హరీష్ యాదవ్, సింగల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు పాల్గొన్నారు.

ఉధృతంగా మారిన గొడ్డు కాలువ

సహాయక చర్యల్లో పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలో 6వతేదీ గురువారం కురిసిన వర్షాల కారణంగా సంతపేట ప్రాంతంలోని గొడ్డు కాలువ ఉధృతంగా ప్రవహించింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చిత్తూరు సబ్-డివిజన్ డిఎస్‌పి సాయినాథ్ పర్యవేక్షణలో టూ టౌన్ సిఐ నెట్టికంటయ్య, సిబ్బందితో కలిసి వెంటనే ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలు, నీరు చేరిన ప్రాంతాల్లో పహారా విధులు నిర్వహించి, వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. అలాగే అవసరమైన చోట టార్చ్ లైట్లు, తాడు, లైఫ్ జాకెట్లు వంటివి సిద్ధంగా ఉంచి రాత్రంతా మానిటరింగ్ కొనసాగించారు. స్థానిక మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అత్యవసర సేవలు అందించారు. ప్రమాదం తలెత్తకుండా ప్రజలకు సూచనలు అందించారు. ఇళ్ల వద్ద ఉండి పిల్లలను బయటకు పంపవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత తమ మొదటి ప్రాధాన్యతని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే 112, టూ టౌన్ పోలీసులకు 94409 00005కు సమాచారం ఇవ్వాలని ఇన్స్పెక్టర్ తెలిపారు.



వరద సహాయక చర్యల్లో టూ టౌన్ పోలీసులు

ప్లాస్టిక్‌తో నిండిన చెరువు

- నీటిలో తేలుతున్న వ్యర్థాలు
- జీవపర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు

ప్రజాశక్తి- వి కోట

మండల కేంద్రమైన వీకోటలోని కీలపల్లి పెద్దచెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసి మురగడం వలన నీరు కలుషితం కావడంతో జీవ పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 126 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువుగా అలరారుతున్న కీలపల్లి చెరువు ఇటీవల విడుదలైన కృష్ణా జలాలతో పూర్తిగా నిండి మొరవ పారుతోంది. పట్టణంలోని వ్యర్థాలన్నీ చెరువులోనే వేయడంతో ఇటీవల చెరువులోని చేరిన నీరులో ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసిపోవడంతో నీరు పూర్తిగా కలుషితమైంది. పట్టణంలోని చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, హాస్పిటల్స్, దుకాణాల్లో ఎక్స్పైర్ అయిన ప్రతి వస్తువును చెరువులో పడేస్తున్నారు దీంతో నీళ్లు పూర్తిగా కలుషితమయ్యాయి. ఈ నీటిని తాగే మూగ జీవాలు, పక్షులు, చేపలు రోగాల బారిన పడుతాయని పరిశోధకులుకు తెలుపుతున్నారు. మనుషులు కూడా ప్రమాదకరమైన రోగాల బారిన పడే అవకాశం



చెరువు నీటిలో తేలుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకులు ప్రజలు సమన్వయంతో కీలపల్లి చెరువులో నిండిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

మొరవపోయిన కీలపల్లి పెద్ద చెరువు..

మండలంలోని అతిపెద్ద చెరువుగా పేరుందిన కీలపల్లి పెద్ద చెరువు. ఈ చెరువు పూర్తిస్థాయిలో నిండి శుక్రవారం మొరవ పోయింది. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు అక్కడికి చేరుకుని టిడిపి మండల అధ్యక్షుడు రాష్ట్ర వేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు చొరవ చూపి కుప్పం బ్రాంచ్ కణాలకు హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను తీసుకురావడంతో మండలంలో దాదాపు 20 చెరువుల వరకు పూర్తిగా నిండాయని దీనితో మండలంలో ఈ సంవత్సరం నీటి కొరత పూర్తిస్థాయిలో తీరిందని హర్షం వ్యక్తం చేశారు. రాంబాబు, ఈశ్వర్ గౌడ్, శబరిష్, సుబ్బన్న, నారాయణస్వామి హరినాథ్ రెడ్డి, ఏఆర్ నాగరాజు, ఎస్‌కె ఇక్బాల్, సురేంద్ర, ముకుంద, విశ్వేశ్వరయ్య, మురళిపాల్గొన్నారు.

చిత్తూరులో జోయాలుక్కాస్ 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'



సేల్స్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్ జోయాలుక్కాస్ 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' చిత్తూరు నగరంలోని ఐకానిక్ ప్రకాశం హైరోడ్ షోరూమ్‌లో మెరిపించడానికి సిద్ధంగా ఉందని ఆల్ ఇండియా రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు షోరూమ్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్పీ రాజశేఖర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేష్ కృష్ణన్ మాట్లాడుతూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రదర్శన వజ్రాభరణాలలో నైపుణ్యం, సొగసు, ఆవిష్కరణల మరపురాని వేడుకను చేస్తుందన్నారు. ఆకట్టుకునే పెళ్లి నగల సెట్ల నుండి సమకాలీన నిత్య మెరుపుల వరకు ఈ షోలో శాశ్వత సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో మిళితం చేసే ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి డిజైన్ ఒక కళాఖండమని షో సమయంలో పరిమిత సమయం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈఅవకాశాన్ని చిత్తూరు పరిసర ప్రాంతప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాజీ మార్గమే రాజ మార్గంగా డిసెంబరు 13వతేదీన లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని డిఎల్ఎస్ఏ సెక్రటరీ తన ఛాంబర్‌లో డిసెంబరు 13న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజా మార్గంగా గుర్తించి జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవడానికి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా కాలంగా పరిష్కారం కానీ అనేక కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోచ్చన్నారు. భావోద్వేగాలు, క్షణకావేశంలో చేసే తప్పులపై నమోదైన కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకో వచ్చునని తెలిపారు. బ్యాంక్ కేసులు, ఆక్సిడెంట్‌లు, ఇన్సూరెన్స్ కేసులు, వివాహ సంబంధ కేసులు, సివిల్, చిన్న పాటి క్రిమినల్ కేసులు, రెవెన్యూ కేసులకు సత్వర న్యాయం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ ఇప్పించి రాజీ అనంతరం కేసు కొట్టివేయడం జరుగుతుందన్నారు. ఈ కేసులకు అప్పీలు ఉండదన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కోర్టు సమయంతో పాటు కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. మండల మరియు జిల్లా స్థాయిలో ప్రతి రోజూ లోక్ అదాలత్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నల్లపువానికుంట చెరువు కట్టకు గండి

ఎట్టకేలకు గండి పూడ్చిన అధికారులు

ప్రజాశక్తి- సోమల

సోమల పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలోని నల్లపు వానికుంట కట్టపై వారం రోజుల క్రితం గండిపడి నీరు వృధాగా పోతోంది. గండి పడిన విషయాన్ని రైతులు సోషల్ మీడియా ద్వారా అధికారులకు నాయకులకు తెలిసే విధంగా వారం రోజులుగా పోస్టులు పెడుతూ వచ్చారు. ఎట్టకేలకు శుక్రవారం ఎంపీడీవో ప్రసాద్, పిఎసిఎస్ చైర్మన్ శివశంకర్, సీనియర్ నాయకులు భాను, మహేంద్ర, వీఆర్వోలు కలిసి గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించి ట్రాక్టర్లతో మట్టి, ఇసుక వేసి పూడ్చివేశారు. దీంతో వృధాగా పోతున్న చెరువులో నీటికి అడ్డుకట్ట వేసినట్టు అయింది. చెరువు పూర్తిగా నిండితే చెరువు కింద దాదాపు 50 నుండి 60 ఎకరాలు ఆయకట్టు రైతుల పొలాలకు నీరు అందుతుంది. శాశ్వత ప్రాతిపదికన చెరువు కట్ట మరమ్మతు పనులు చేయించాలని ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు.



చెరువు గండిని పూడ్చిన అధికారులు

ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలు పరిష్కరించడానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుడిపాల మండల పరిషత్ కార్యాలయంలో ప్రజల నుంచి 42అర్జీలు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ఎమ్మెల్యే స్వయంగా అర్జీదారులతో మాట్లాడి ప్రజల అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూ, భూ సమస్యలు వస్తున్నాయని వీటిపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులపై సంబంధితశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో శిరీష, తహశీల్దారు శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్ కుమార్, ట్రాన్స్ కో ఏఈ శివకుమార్, ఏపీఎం సుధారాణి పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక వందేమాతరం

అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్.రాజశేఖర్ రాజు



చిత్తూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'వందే మాతరం' రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం చిత్తూరు పట్టణంలోని గాంధీ కూడలి వద్ద జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు, 1000 మంది విద్యార్థులు, సిబ్బంది, ప్రజలతో కలిసి వందేమాతరం గీతాన్ని ఏకస్వరంగా ఆలపించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ ఎస్ఆర్. రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ.. వందేమాతరం అనేది దేశభక్తి నినాదం మాత్రమే కాదని, అది మన మనసుల్లో దేశమంటే ఏమిటో గుర్తుచేసే శక్తి అని అన్నారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయులలో ఆత్మవిశ్వాసాన్ని, త్యాగస్ఫూర్తిని నింపిందన్నారు. వందేమాతరం మన దేశం పట్ల ఉన్న గౌరవం, ప్రేమ, సేవాస్ఫూర్తికి ప్రతీక అన్నారు. విద్యార్థులు, పోలీసులు, ప్రజలు ఒకే గళంలో ఆలపించడం ద్వారా మన దేశ ఏకతను, ఐకమత్యాన్ని ప్రతిబింబించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, 1 టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్, 2 టౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య, మహిళా స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు, క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ వీరేశ్, చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కటారి హేమలత పాల్గొన్నారు.

దేశభక్తి స్ఫూర్తిని నింపిన వందేమాతరం : ఎమ్మెల్యే

భారత స్వతంత్ర ఉద్యమ సమయంలో వందేమాతరం గీతం లక్షల మందిలో దేశభక్తి స్ఫూర్తిని నింపిందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శుక్రవారం గుడిపాల మండల పరిషత్ కార్యాలయంలో వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. స్థానిక ప్రజలు, అధికారులు, విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కుస్తీ పోటీల్లో అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విభాగంలో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన నరహరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.మహాలక్ష్మిని అభినందించి సత్కరించారు.

సోమల: వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శుక్రవారం మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ విజయకుమారి వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు వందేమాతరం గురించి తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు పిఆర్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం: స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ విద్యాసంస్థలలో వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో విద్యార్థులు జాతీయ సమైక్యతను కాపాడుకోవాలని, ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప తెలిపారు. ట్రైనింగ్ ఎస్ఐ రమేష్, కళాశాల డైరెక్టర్లు జీ.ధనంజయ రెడ్డి, ఎస్.వెంకటేష్, ఏ,పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ దుర్గా భవాని, హై స్కూల్ హెచ్ఎం లతా పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలోని రొంపిచెర్ల గ్రామపంచాయతీ బస్టాండ్ సర్కిల్లో ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. బాలుర, బాలికల, ఉర్దూ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో జాతీయ జెండాను పురవీధులలో ఊరేగించి, ర్యాలీగా వచ్చి బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఎస్ఐ సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, అమరశేఖర్, ఎం.సుజాత, ఉపాధ్యాయులు రఫీ బాష, శ్రీనివాసులు రెడ్డి, లాల్ షా, కళ్యాణి, నాగరాజ, అమరనాయక్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వందేమాతర గీతం ఒక విశిష్టత ఉన్నదని డివైఈవో ఇందిరా విద్యార్థులకు తెలియజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వందేమాతర గీతం ఆలపించారు.

తవణంపల్లి: మండలంలోని కృష్ణాపురం సచివాలయం పరిధిలో సచివాలయ సెక్రటరీ రెడ్డయ్య ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు వందేమాతరం గీతాన్ని అలపించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల తర్వాత ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చొరవతో గుడిపాల మండలంలోని అడవిచేను గ్రామానికి మూడు దశాబ్దాల తర్వాత ఆర్టీసీ బస్సు వచ్చింది. శుక్రవారం గుడిపాల మండలం పర్యటనలో భాగంగా చిత్తూరు - అడవిచేను ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే గురజాల్, గ్రామస్తులతో కలిసి పూజ చేసి ప్రారంభించారు. గత 30 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిసర గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు ఏర్పాటుతో ఎంతో స్వాంతన చేకూరింది. తమ కలను నెరవేరుస్తూ బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. అంతకుముందు బొమ్మసముద్రం క్రాస్‌లో గొల్లమడుగు, పానాటూరు ఆర్టీసీ బస్సు సర్వీసును పూజచేసి ప్రారంభించిబస్సులో ప్రయాణించారు. మండలంలోని వెంగమాంబపురం, గట్రాళ్లమిట్ట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ భవనాలకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారాయుడు, ఉపాధ్యక్షులు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, సింగల్ విండో చైర్మన్ ప్రతాప్ నాయుడు, గోళ్ళ హేమాద్రి నాయుడు, బాలాజీ నాయుడు, అనిల్ కుమార్, సుమతి పాల్గొన్నారు.

ఏడు పరిశ్రమల్లో 22వేల మందికి ఉపాధి

కార్మిక చట్టాలను అమలు చేయాలి
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో ఎన్నడు లేనివిధంగా పారిశ్రామిక అభివృద్ధి జరగడం అభినందనీయమని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ నాగరాజు పేర్కొన్నారు. ప్రతినిత్యం కుప్పం ప్రాంతం నుంచి బతుకుతెరువు కోసం 10వేల మందికి పైగా బెంగళూరుకు కూలి పనుల కోసం పుష్పుల్ రైలులో వెళ్లి వస్తుండటాన్ని చూస్తుంటే కుప్పం ప్రాంతవాసులు ఎంత ఇబ్బందులు పడుతున్నారో అర్థమవుతుందన్నారు. కుప్పం నుండి 8సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కుప్పం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో కూడా ఇక్కడ అభివృద్ధి జరగలేదని, దీనిపై విమర్శలు కూడా వచ్చేవని అన్నారు. కుప్పంలో సొంత ఇల్లు నిర్మించుకున్న చంద్రబాబు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు కుప్పం అభివృద్ధి బాధ్యతలు అప్పగించడంతో నియోజకవర్గంలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

ఏడు పరిశ్రమల్లో 22,000 మందికి ఉపాధి

అలీపు పరిశ్రమ వెయ్యి మందికి పరోక్షంగా 2500 మందికి కల్పిస్తామన్నారు. మదర్ డెయిరీ ప్రత్యక్షంగా 850 మందికి పరోక్షంగా 3150 మందికి, ఏసీఈ పరిశ్రమలో ప్రత్యక్షంగా 250 మందికి పరోక్షంగా 150 మందికి ఉపాధి కల్పించనున్నారు. అలాగే శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్లు ప్రత్యక్షంగా 850 మందికి పరోక్షంగా 3150 మందికి ఉపాధి కల్పిస్తారని, హిండాల్కో పరిశ్రమలు ప్రత్యక్షంగా 6313 మందికి పరోక్షంగా 310 మందికి, ఎస్వీఎఫ్‌లో ప్రత్యక్షంగా 1500 మందికి ఉద్యోగాలు కల్పిస్తుండడంతో కుప్పం ప్రాంతంలో నిరుద్యోగ సమస్య కొంతవరకు తీరుతుందన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

కుప్పం ప్రాంతంలోని పరిశ్రమల్లో కార్మిక చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే కుప్పం ప్రాంతంలో ఉన్న షాహి గార్మెంట్ ఇతర పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు రాకుండా కార్మిక చట్టాలు అమలు కాకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారని అన్నారు. 8వ తేదీ సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసే ఏడు పరిశ్రమల ద్వారా సుమారు 23 వేల మందికి ఉపాధి దొరుకుతుందని అయితే కార్మిక చట్టాలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. ఎనిమిది గంటల పనివిధానం కాకుండా పది నుండి 13 గంటలు పని చేయాలని నిర్ణయించడం, మహిళలకు రాత్రిపూట పనిచేయాలని నిబంధనలను పెడితే పరిశ్రమలు వచ్చి ఉపయోగం ఏముంటుందని ఆయన ప్రశ్నించారు.

అంగన్వాడీ హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు




సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం అంగన్వాడీ ప్రాజెక్టులో హెల్పర్ల సమస్యలపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని హెల్పర్లు సెంటర్ నిర్వహణలో పిల్లల ఆలనాపాలన చూడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అలాంటి వారి సమస్యలు రోజురోజుకీ ఎక్కువ అవుతున్నాయని, కేవలం రూ.7వేలతో వారి కుటుంబాల జీవనం ఎలా గడుస్తుందన్నారు. పోరాటాలు చేసి హెల్పర్లు ప్రమోషన్లు సాధిస్తే అధికారులు నిర్లక్ష్యం రాజకీయంతో అర్హులైన వారికి ప్రమోషన్ లేకుండా అన్యాయం చేస్తున్నారని, గతంలో కుప్పం ప్రాజెక్టులో అదేవిధంగా అన్యాయం జరిగిందని తెలిపారు. రిటైర్మెంట్ అయిన సందర్భంగా సెంటర్లో పనిచేస్తున్న హెల్పర్ అర్హులకి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను సూపర్వైజర్లు పరిష్కారం చేసే దిశగా చూడాలని కోరారు. వేతనాలు పెంచి ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ హెల్పర్లు పిల్లలకు, లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈసమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, ప్రాజెక్టు అధ్యక్షురాలు సరళ, కోశాధికారి కస్తూరి, హెల్పర్లు, ఏసీ డిపిఒ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాల్లో వెయ్యి కోట్లతో పరిశ్రమ ఏర్పాటు

యువతకి ఉపాధి ఉద్యోగాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే థామస్



పిఎసిఎస్ చైర్మన్, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని శ్రీరంగరాజపురం మండలంలో వెయ్యి ఎకరాలలో వెయ్యి కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు డాక్టర్ విఎం. థామస్ పేర్కొన్నారు. శుక్రవారం కార్వేటినగరంలో పిఎసిఎస్ చైర్మన్‌గా మాదిరాజు జనార్ధన్ రాజు ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా ఆర్.జయచంద్ర, సి.చిన్నబాబులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా టిడిపిలో ఉంటూ సేవలు అందించిన సీనియర్ టిడిపి నాయకులు జనార్ధన్ రాజు పేరును సీఎం దృష్టికి తీసుకెళ్లగా పిఎసిఎస్ చైర్మన్ చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా డైరెక్టర్లు కూడా పార్టీకి సేవలు అందించిన వారేనన్నారు. జిల్లాలోని కార్వేటినగరం సొసైటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం మామిడి రైతులకు టన్నుకు రూ.4వేలు అందించడం జరిగిందన్నారు. చెరుకు రైతులు కూడా టన్నుకు రూ.5వేలు అందేలా సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు జరిగేటట్లు చేస్తామన్నారు. అనంతరం పిఎసిఎస్ చైర్మన్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి శక్తి వంచన లేకుండా కృషిచేసి రైతులకు సేవ చేస్తానని అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే థామస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర పొల్యూషన్ డైరెక్టర్ నాగేశ్వరరాజు, మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, గంధమనేని జయశంకర్ నాయుడు, స్వామి దాసు, ఇందిరమ్మ, రుద్రయ్య నాయుడు పాల్గొన్నారు.

సివిల్ పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా గంగాధర్ నెల్లూరు వద్ద గల చిత్తూరు పోలీస్ డిపార్టుమెంటుకు చెందిన ఫైరింగ్ రేంజ్‌లో సివిల్ అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులు నిరంతరం పరిరక్షిస్తూ ఉంటారని, కావున ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకొని, ఫైరింగ్‌లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుందని, ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు ఫైరింగ్ ప్రాక్టీసెస్‌ను జాగ్రత్తగా చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ ప్రక్రియ గురించి సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్క బుల్లెట్టు టార్గెట్ (లక్ష్యం) వైపే బుల్ పడే విధంగా తర్ఫీదు పొందాలన్నారు. అదేవిధంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జిల్లా పోలీసు శాఖ ఉన్నతి కోసం ముందడుగు వేయాలని తెలిపారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీసులో ఆర్ఐ అడ్మిన్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



పంటలపై ఏనుగుల దాడి



ధ్వంసం అయిన పంటలను అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - రొంపిచర్ల : పులిచెర్ల మండలం దేవళం పేట పంచాయతీలో వరుసగా ఏనుగుల దాడులు కొనసాగు తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున అడవిలో నుంచి వచ్చిన ఏనుగుల గుంపు దేవలంపేట పరిసరాలలో రైతులకు సంబంధించిన వరి పంట, మామిడి చెట్లను ధ్వంసం చేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అడవులో నుంచి ఏనుగులు వచ్చే క్రమంలో గ్రామ పరిసరాలకు చేరుకుని బిగ్గరగా అరుస్తూ వ్యవసాయ పంటలపై దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వరి పంటను తొక్కి, మామిడి చెట్లను విరిచేసి తిరిగి అడవుల్లోకి వెళ్లినట్లు రైతులు తెలిపారు. ఏనుగుల దాడిలో ధ్వంసం అయిన పంటలను అటవీశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ అధికారులు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కృష్ణమూర్తి, మధు తెలిపారు. వ్యవసాయ పంట పొలాలపై వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పేదవారి సొంతింటి కల సాకారం

- కుప్పం మున్సిపాల్టీలో 509 మందికి పక్కా గృహాలు
- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ఎన్‌టిఆర్ గృహాల లబ్ధి పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం: రాష్ట్రంలో పక్కా గృహం లేని నిరుపేదలు ఉండకూడదన్న దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ గృహ పథకంలో పేదలకు పక్క గృహాలు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 509 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ గృహ పథకంలో పక్కా గృహాల నిర్మాణానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పి కే యం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తుందని 509 మంది లబ్ధిదారులకు పక్కా గృహాల నిర్మాణం కోసం 12.72 కోట్ల మంజూ రు చేసినట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ అదనంగా ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందిస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థు లను గెలిపించి పక్కా గృహాలు మంజూ రైన వారు త్వరిత త్వరగా గృహ నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశాలు చేసి సొంతింటి కలను నెరవేర్చు కోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతా రామ్, రెస్కో చైర్మన్ ప్రతాప్, అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, ఎం ఆర్ సురేష్, సురేష్ డాక్టర్ వెంకటేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పలమనేరు–పుంగనూరు రహదారిలోని కలగటూరు క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ నల్లసానపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య కుమారుడు భరత్ తన స్నేహితుడితో కలసి శుక్రవారం ద్విచక్ర వాహనంలో దేవాలయానికి బయలు దేరాడు. పలమనేరు –పుంగనూరు రహదారిలోని కలగటూరు క్రాస్ వద్ద పుంగనూరు నుండి వస్తున్న లారీ ద్విచక్రవాణాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో భరత్ (20) అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. కార్తీక్‌కు తీవ్ర గాయాలు కాగా పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గంగవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మేగా జాబ్‌మేళాలో పాల్గొన్న అధికారులు, నాయకులు, నిరుద్యోగులు

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- గుడిపల్లి: యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయమని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. గ్రీన్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో మొట్ట మొదట ప్రతిష్టాత్మకంగా ద్రావిడ విశ్వవిద్యాలయంలో మెగా జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కుప్పంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పన ధ్యేయంగా కుప్పంలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆచార్య యం దొరస్వామి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ప్రతి విద్యార్థినివిద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రిజిస్ట్రారు ఆచార్య వి కిరణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలకి పెద్ద ఎత్తున విశ్వవిద్యాలయ విద్యార్థులు, కుప్పం ప్రాంత విద్యార్థులు హాజరయ్యారు. 15 కంపెనీల వారు నిర్వహించిన ఇంటర్వ్యూ లలో 180 మంది ఎంపిక చేశారు. వారికి త్వరలోనే నియామక పత్రాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పీకేఎం చైర్మన్ డాక్టర్ బిఆర్‌సురేష్ బాబు , టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, రెస్కో చైర్మన్ వి జీ ప్రతాప్, కుప్పం ప్రాంత ప్రజా ప్రతినిధులు, ప్లేస్‌మెంటు అధికారిణి అమ్ములు, 1 ఎం1బి ప్రతినిధులు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం లోని కొత్రకోన పంచాయతీ పరిధిలో గారంపల్లి గ్రామం సమీపంలోని నీవా నదిలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వయసు దాదాపు 30 నుండి 40 సంవత్సరాలు గలిగి, పాడై శరీరంపై పురుగులు కదులుతున్న స్థితిలో కనిపించిందన్నారు. కొత్రకోన రెవెన్యూ గ్రామ వీఆర్‌వో పి నరేష్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, సదరు ఫిర్యాదు పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో, ఎవరైనా మగ వ్యక్తులు తప్పిపోయి ఉన్న వారి ఆచూకీ తెలిసిన వారు జిడినెల్లూరు పోలీసులను సంప్రదించాలన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పాతపేట గ్రామానికి చెందిన ఆనంద్ భార్య లక్ష్మి (38) ఈ నెల 4వ తేదీ రాత్రి, భర్తతో తీవ్ర వాగ్వాదం అనంతరం ఆవేశంతో ఇంట్లోనే ఉన్న పెట్రోల్ తీసుకుని తన ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కాపాడి, తొలుత మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం ఆమె బెంగళూరు విక్టోరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. లక్ష్మికి ముగ్గురు సంతానం ఉన్నారని పెద్ద కుమార్తె బిందు (17), రెండో కుమార్తె చరిత (16), కుమారుడు (10) వున్నారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై సీఐ పరశురాముడు కేసు నమోదు చేసి, విక్టోరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమె స్టేట్‌మెంట్‌ను అక్కడే తహశీల్దారు ఆధ్వర్యంలో రికార్డు చేశామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు బైరెడ్డిపల్లి పోలీసులు తెలిపారు.

కార్వేటినగరాన్ని తిరుపతిలో కలపాలి

ఎమ్మెల్యేకు వినతి



ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్‌కు టిడిపి నాయకులు రవి యాదవ్, జగన్నాథం, బిజెపి నాయకులు రాజశేఖర్, కాంగ్రెస్ అధ్యక్షులు గౌతమ్ రాజు, గ్రామస్తులు ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గతంలో ఎన్నికల హామీలో భాగంగా కార్వేటినగరం గాండ్ల మిట్ట కూడలి వద్ద చంద్రబాబు తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

డైరెక్టర్ జయచంద్రన్నకు సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం సొసైటీ డైరెక్టర్ జయచంద్రన్న ను టిడిపి నాయకులు పవన్ కుమార్ , తులసిమని, కేశవులు శెట్టి, మూర్తి , శ్రీధర్ రెడ్డి శుక్రవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కోటి సంతకాలు సేకరణ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తున్నట్లు పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కీరమంద, కొదలమడుగు, టేకుమంద గ్రామాల్లో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు దత్తు రెడ్డి, సర్పంచి రాజా, మనోహరి, అమరావతి నాయకులు కిషోర్ కుమార్ రెడ్డి, గజేంద్ర పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పలమనేరు మండలంలోని జిఎల్ఎస్ ఫామ్ ఉన్నత పాఠశాలలో డివిజన్‌స్థాయి శుక్రవారం వాలీబాల్ నిర్వహించారు. డివిజనల్ స్థాయి వాలీబాల్ పోటీలలోఎం ప్రేమసాయి, బి రాహుల్ అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోరంజని, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభపై గర్వంగా ఉందని, జిల్లా స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారిని అభినందించారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -యాదమరి: షేర్ జీసస్ వరల్డ్ ఫౌండర్ ఎల్ జోసెఫ్ ప్రభుత్వ ఎా ం ు ల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. శనివారం మండల పరిధిలోని మారు మూల గ్రామీణ ప్రాంతం దిగువ కంతల చెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షేర్ జీసస్ వర్డ్ ఫౌండర్ జోసెఫ్ యుస్ డోనార్శ్రీ నెయిల్ ఫెయిర్లాంబ్ సహ కారంతో తొమ్మిది మంది విద్యార్థినులకు సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ మజీద్ సాహెబ్, గొల్లపల్లి ఉపాధ్యాయులు మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు జగన్నాథరావు, గిరిబాబు, మణి , దేవానంద్, మురళి, చాముండేశ్వరి, మురాద్‌షా పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బెస్త కార్పొరేషన్ డైరెక్టర్



మంత్రిని కలిసిన అమరావతి

ప్రజాశక్తి -బంగారుపాలెం: బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన అమరావతి శుక్రవారం విజయవాడలో ఓ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్‌ను కలిశామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గతంలో బంగారు పాలెం మండలం తగ్గువారిపల్లి పంచాయతీ మాజీ సర్పంచిగా విధులు చేపట్టినట్లు, ఆ కోవలోనే ప్రస్తుతం బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారని, తన ఎంపికకు సహకరించిన మండల, జిల్లా, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి లోకేష్ గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి పనిచేయాలని తద్వారా ప్రతి ఒక్కరికీ పదవులు వస్తాయని తెలిపారు.

పర్యావరణ రక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి- రామకుప్పం: సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని రామకుప్పం మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. రామకుప్పం బాలుర జడ్పీ హైస్కూల్లో శుక్రవారం మొక్కలు నాటారు. కలుషిత గాలులను, కలుషిత వాతావరణాన్ని నివారించేందుకు ప్రకృతిని కాపాడు కునేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి నరసింహులు, పాఠశాల ప్రధానోపాధ్యులు ధనంజయలు, శ్రీరాములు, మురళీధర్ ,ఆదిల్, సుబ్రహ్మణ్యం, బాలు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించరా?

సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సర్వసభ్య సమావేశంలో సర్పంచు లు ఎంపిటీసీలు సమస్యల పరిష్కారంపై ధ్వజమెత్తారు. గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వెజ్జు పల్లి సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డి, ఎంపిటీసీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చెరువులు, కాలవలు అక్రమాలకు గురవుతున్నాయని ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దారు శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రామాల్లో దోమల బెడదతో తీవ్ర ఇబ్బంది లు పడుతున్నామని, పెద కాలవ పంచాయతీ చెర్లోపల్లి కాలనీ ప్రభుత్వ లేఔట్లలో పైప్ లైన్లు అమర్చాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం కోరారు. పెద్దదామరగుంటలో ఎంపీపీ పాఠశాల వర్షపు నీటికి ఉరుస్తోందని అధికారుల చర్యలు చేపట్టాలని వెజ్జు పల్లి సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డి కోరారు. పలు సమస్యలు ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకురాగా వీటన్నిటిని వచ్చే సమావేశంలోపు పరిష్కరించాలని ఎంపీపీ అనిత అధికారులను ఆదేశించారు. సిడిపిఓ పద్మ సునంద సభ్యులతో మాట్లాడుతూ గ్రామాల్లో అంగనన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వచ్చే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, సింగల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు, అగ్రికల్చర్ ఏవో భవాని, ఇంచార్జ్ ఈవో పి ఆర్ డి శివయ్య, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు, ఏపిఎం ఫరీద్ మస్తాన్, విద్యుత్ శాఖ ఏఈలు వరదరాజులు, తనిజవేలు, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం కార్యదర్శులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి

తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి



ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో రైతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని కుప్పం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు చలపతి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాటా ్లడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే డ్రిప్ ఇరిగేషన్, గోకులం షెడ్లు, ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయలు, పండ్లు తోటలకు పందిర్లు, అన్నదాత సుఖీభవ తో ఆర్థికంగా తోడ్పడ్డారన్నారు. శ్రీశైలం నుంచి 735 కిలోమీటర్ల మేర కాలువ ద్వారా కుప్పానికి హంద్రీ–నీవా జలాలను తీసుకొచ్చి ప్రతి చెరువును నింపు తున్నారని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాలు, పశుగ్రాసం, పాడి ఆవులకు సబ్సిడీలు ఇచ్చి రైతులను ఆదుకుంటు న్నారని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం: కెసి హాస్పిటల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హై స్కూల్ , నాయనారులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్ మహేష్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు కోరిక మేరకు కే సి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించా మన్నారు. కే సి హాస్పిటల్ డాక్టరు భవ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దంత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, దాని వల్ల విద్యార్థులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని, తమ హాస్పిటల్ నుంచి ఎలాంటి వైద్య సహాయం అయినా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ సెల్వం , సభ్యులు జయరాం నాయుడు, డాక్టరు వరప్రసాద్, శబరీష్, రూపేష్, ఉపాధ్యాయులు స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి రేషన్ ప్రభుత్వ ధ్యేయం: తహశీల్దారు

ప్రజాశక్తి -బంగారుపాలెం: ప్రతి పేదవాడికి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వ ధ్యేయమని తహశీల్దారు షబ్బీర్ బాష అన్నారు. శుక్రవారం మండలంలోని తగ్గువారిపల్లి ,బంగారుపాలెం 1 రేషన్ షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి పేదవాడికి రేషన్ అందే విధంగా చూడాల్సిన బాధ్యత డీలర్ల పై ఉంటుందని ఒకటవ తారీఖు నుండి మొదలెట్టి రేషన్ ప్రతి ఒక్కరికి అందివాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటరమణ డీలర్లు రఘు, కృష్ణయ్య పాల్గొన్నారు

రొంపిచర్లలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి - రొంపిచర్ల : రొంపిచర్ల మండలంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యలు స్వీకరించారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం పత్తికొండ, జీడిమకనపల్లి పంచాయతీలలో స్థానిక వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ వ్యాధిపై అనుమానం ఉన్న వెంటనే స్థానిక వైద్యులు సంప్రదించి వైద్యం చేయించుకుంటే ప్రాణాపాయం నుండి బయటపడచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోమల: సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మహమ్మారిలా పీడిస్తున్న కేన్సర్ వైద్య పరీక్షలు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా నిర్వహిస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధి కారులు జయసింహ ప్రదీప్ కుమార్ రెడ్డి సిహెచ్ఓ అమరనాథ్ , ఏఎన్ఎంలు, సూపరువైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: కేన్సర్ స్క్రీనింగ్ తోనే వ్యాధిని గుర్తించడం సాధ్యమని సిహెచ్‌సి డాక్టర్ శిరీష అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సి హెచ్ సి ఆవరణలో జాతీయ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు విజయ్ కుమారి, షాలిని, రాగా భవాని, స్వాతి, సుమతి బాయ్ ఐసిటిసి కౌన్సిలర్ బాబు , రోహిత్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపరువైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర నాదరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎంఎల్ హెచ్ పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల ప్రధాన వైద్యులు డాక్టర్ జె శ్రీనివాసులు, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో కేన్సర్ అవగాహనా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లహరి, డాక్టర్ సర్తాజ్, సాయి చైతన్య జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బైరెడ్డి పల్లిలో

బైరెడ్డి పల్లి: మండలం పరిధిలో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, విద్యా సంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీహెచ్ ఎస్ స్కూలు, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ పద్మావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కాంతమ్మ, ఆరోగ్య సిబ్బంది రెడ్డమ్మ, లక్ష్మి, రాజారెడ్డి, గ్రామ పెద్దలు, హెచ్ఎమ్ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బైరెడ్డిపల్లి బాయ్స్ హైస్కూల్‌లో ప్రత్యేక సమావేశంలో డాక్టర్ విజయ్ చందర్ (డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్), సావిత్రి కేన్సర స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ మనోరంజని, ఉపాధ్యాయులు, సిహెచ్ఓ సూపరువైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కార్వేటినగరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కత్తిరిపల్లి లో డాక్టర్ హేమశ్రీ ఆధ్వర్యం లో శుక్రవారం ర్యాలీ నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ముక్కా ర వాణి పల్లి సర్పంచ్ లోక నాథరెడ్డి పాల్గొ న్నారు. 15 ఆయుష్మా న్ ఆరోగ్య మందిర్‌లలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



తవణంపల్లిలో


తవణంపల్లి : తవణంపల్లి మండ లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ కేన్సర్ అవగాహన దినో త్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేన్సర్ నివారణ పై అవగాహన ర్యాలీ, మానవహారం తవణంపల్లె పుర వీధులలో నిర్వహించారు. ఆ తరువాత మన జాతీయ గీతం వందేమాతరం" గీతం రచించి ఇప్పటికి 150 సంవత్సరములు అయినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలమేరకు పురవీధులలో ఈ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన వేలు , డాక్టర్ కేశవనారాయణ సిహెచ్ఓ జ్ఞానశేఖర్ , ఆరోగ్య పర్య వేక్షకులు రెడ్డెమ్మ, నిర్మలమ్మ, ఆరోగ్య కార్య కర్తలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు ఏఎన్ఎంలు ఎంఎల్‌హెచ్ పి లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని గుండ్ల కట్టమంచి, తంపుగానిపల్లి, నల్లగాంపల్లి, బొమ్మాయిపల్లి ,ఓటు వంక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఓటర్ల నమోదు అధికారిణి విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. రాబోవు ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను ఉన్నత అధికారి ఆదేశాల మేరకు పరిశీలించామని తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోద చేసుకునేందుకు బిఎల్వోలు అందుబాటులో ఉంచుతామని ఆమె తెలిపారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి- రామకుప్పం: ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రోత్సాహకాలు విపులంగా వివరించాలని పి ఫోర్ ప్రతి నిధులు ఆప్మాస్ వినాయక రెడ్డి పేర్కొన్నారు. పి ఫోర్ పై శుక్రవారం సిఆర్పి లతో సమావేశం అయ్యారు. గ్రామాల్లో ప్రతి కుటుంబానికి వెళ్లి ఉపాధి, ఉద్యోగాల కోసం వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాల అందించే ప్రోత్సాహకాలు వివరించాలన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బంగారు కుటుంబాలుగా తయారు కావడం లక్ష్యంగా పేర్కొంటూ...ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి ఫోర్ ప్రతినిధులు శివకృష్ణ, జిలాని, ధనంజయ రెడ్డి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షుడు, వెంకటరమణ ఆనంద రెడ్డి పాల్గొన్నారు.



కర్ణాటక కౌశల్య అవార్డు స్వీకరిస్తున్న సాయి శ్రీకర్

పలమనేరు వ్యక్తికి కర్ణాటక కౌశల్య అవార్డు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు నియోజకవర్గం పలమనేరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్‌గా విధులు నిర్వహి స్తున్న ధన శేఖర్ , రత్నమ్మ దంప తుల కుమా రుడు సాయి శ్రీకర్ కర్ణాటక కౌశల్య కార్పొరేట్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నాడు. స్మార్ట్ ఈడి ఇన్నోవేషన్ సంస్థను స్థాపించి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కండక్ట్ చేస్తూ కాలేజీల్లో విద్యార్థులకు ఆన్లైన్ టెక్నికల్ ప్రోగ్రాం నిర్వహిస్తూ 150 మందికి జీవనోపాధి కల్పిస్తూ ఆ సంస్థ సీఈవో, ఫౌండర్‌గా ఉన్న పలమనేరు అబ్బాయి సాయి శ్రీకర్, అతని పార్టనర్, కొలీగ్ తిరుపతికి చెందిన గోకుల్ సేవలు అందిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కర్ణాటక సమ్మిట్ గవర్నమెంట్ ఆఫ్ కర్ణాటక అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కౌశల్య కర్ణాటక కార్పొరేట్ ఎక్సలెన్సీ అవార్డును గోకుల్ కర్ణాటక స్కిల్ , డెవలప్‌మెంట్ మినిస్టర్ చరణ ప్రకాష్ రుద్రప్ప పాటిల్ నుండి సాయి శ్రీకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్బాయి సాయి శ్రీకర్, గోకుల్‌ను ప్రశంసిస్తూ మిత్రులు శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

వర్షంతో ప్రధాన రహదారికి దెబ్బ

అధికారులు స్పందించాలి



ప్రజాశక్తి -తవణంపల్లి : తవణంపల్లి మండలం గాజులపల్లి– మాధవరం మార్గమధ్యంలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింటోంది. రహదారి ఇరువైపులా పెద్ద ఎత్తున మట్టి కోసుకుపోవడంతో రోడ్డు పూర్తిగా తెగిపోయే ప్రమాదం నెలకొంది. రహదారి పక్కనున్న నీరు సరిగా పారకపోవడం, డ్రైనేజ్ సదుపాయాల లేమి కారణంగా ప్రతి వర్షం తర్వాత పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని. వర్షాలు కొనసాగితే రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తం కావచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని, పరిస్థితిని పరిశీలించేందుకు అధికారులు , ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై హర్షం

ప్రజాశక్తి- రామకుప్పం: మేజర్ గ్రామపంచాయతీ రామకుప్పం లోని సంత గేటు వీధిలో తాగునీటి సమస్య పరిష్కారంతో ముస్లిం మైనారిటీలు హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ చాలా రోజుల నుంచి తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు ఇటీవలే టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం స్థానిక నేతలు తో కలిసి బోరును మరమ్మతులు చేసి తాగునీటిని సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురళి, మైనార్టీ నేతలు అక్బర్ సాబ్, నియ్యు సాబ్, ఆదిల్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం



ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని గుడివంక కొండపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శుక్రవారం భూమిపూజ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గుడివంక కొండపై కొలువైన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.4.87 కోట్లు, కొండకింద వున్న గంగాధైరేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.1.87 కోట్ల రూపాయలను మంజూరు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి వున్నారన్నారు. కుప్పం నియోజకవర్గం నుండి వచ్చిన ప్రతీ ప్రతిపాదనకు ఆయన తక్షణమే నిధులు విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.54 కోట్ల వ్యయంతో 11 దేవాలయాలు అభివృద్ధి చెందుతుండగా, టిటిడి ఆధ్వర్యంలో మరో 142 దేవాలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ ఆలయన పునర్నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పీఎంకే ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్ బాబు, మండల టిడిపి అధ్యక్షుడు సుబ్రమణి, ఏఎంసీ చైర్మన్ రాజు, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ జెడ్పిటిసి నాయుడు, టిడిపి మాజీ అధ్యక్షుడు హేమంబర్ గౌడ్, రెస్కో చైర్మన్ ప్రతాప్, టిటిడి కమిటీ మెంబర్ శాంతారామ్, నాయకులు కానిపాకం వెంకటేష్, రాజ్ కుమార్, డాక్టర్ వెంకటేష్, ఎస్ ఆర్ చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం..

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ్

పజాశక్తి- రామకుప్పం: ప్రజలు కోర్టులు అందించే న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలని కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ్ పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం 2025 సందర్భంగా శుక్రవారం విజలాపురం కేజీబీవీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు కుప్పం మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి వరుణ్ తేజ్ మాట్లాడుతూ భారతదేశం ప్రతి సంవత్సరం నవంబర్ 9,1995న అమల్లోకి వచ్చిన 1987 నాటి న్యాయ సేవల అధికారుల చట్టం ఆమోదం పొందినందుకు గౌరవసూచకంగా ఈ తేదీ జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని జరుపుకుంటుంటోందన్నారు. న్యాయం పొందడం పౌరుల హక్కు అని, ఇందుకు హామీ ఇచ్చేందుకే ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కుప్పం పారా లీగల్ వాలంటీర్లు మహేష్ , సెల్వం , కోర్టు సిబ్బంది రాజా, హరి, ఉపాధ్యాయులు స్వాతి, లలిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లె నిద్ర



ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం బండ కిందపల్లె గ్రామం హనుమంతరాయనపేటలో శుక్రవారం పోలీసుల పల్లె నిద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు సైబర్ క్రైమ్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వాహనాల్లో ప్రయాణిం చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలని అన్నారు. గ్రామం ముందర జాతీయ రహదారి ఉండడం వల్ల రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా గ్రామస్తులు తమ సొంత పనుల మీద బయటకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించు కోవాలన్నారు. అనం తరం గ్రామంలోని నిద్రకు ఉపక్రమిం చారు. ఈ కార్యక్ర మంలో బండ కింద పల్లి గ్రామ టిడిపి అధ్యక్షుడు ఊటుకూరు మదన్మోహన్ రెడ్డి, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ ఎం భాస్కర య్య, గ్రామస్తులు అమరనాథ్ రెడ్డి, రామయ్య, రెడ్డప్ప, రాజా, లక్ష్మి,, హెడ్ కానిస్టేబుల్ ఏలుమలై రెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

కుంభాభిషేకంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : మండలంలోని మెదవాడ పంచాయతీ మర్రి పల్లె గ్రామంలో రుక్మిణి సత్యభామ ఆలయ కుంభాభిషేకంలో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ శుక్రవారం పాల్గొన్నారు. గ్రామస్తులు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకి ఆలయ వస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు. ఈ పురాతన ఆలయం గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు సహకారంతో ఆలయ జీర్ణో ద్ధరణ చేసి నిర్మించారు. ఆలయం పక్కనే నాగాలమ్మ విగ్రహం ప్రతిష్ఠిం చారు. గత మూడు రోజులుగా అత్యంత వైభవంగా కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొనడం తో గ్రామస్తులు ఆనంద వ్యక్తులు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జిల్లా నాయకుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెడ్‌షీట్లు పంపిణీ



ప్రజాశక్తి -విజయపురం (నగరి) : స్థానిక కాపుసంఘం వారు కేన్సర్ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులు 40 మందికి బెడ్‌షీట్‌లు, ఆర్పీలకు కేన్సర్ గురించి వివరించే క్లాత్ బ్యాగులు అందించారు. నియోజకవర్గ కాపుసంఘం నాయకుడు బాబు ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంవో మంజుల, వైద్యులు మహేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికు లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించా లన్నారు. డాక్టర్ మంజుల గర్భకోశ కేన్సర్ గురించి వివరించారు. డాక్టర్ మహేష్ రొమ్ము క్యాన్సర్ గురించి వివరించారు. ముందస్తుగా గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి ప్రసాద్, పారిశుధ్య కార్మికులు, ఆర్పీలు పాల్గొన్నారు.

హైవే బాధితులతో ఆర్‌డివో చర్చలు



హైవే బాధితులతో చర్చిస్తున్న ఆర్‌డీవో అనుపమ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పుత్తూరు నుంచి తిరుత్తణి వరకు జరుగుతున్న జాతీయ రహదారి వెడల్పు పనుల్లో భాగంగా బాధితులకు తొలగించే ఆలయాలకు సంబంధిత నిర్వాహకులతోను ఆర్డీవో అనుపమ శుక్రవారం చర్చించారు. వికేఆర్ పురం వద్ద ఓం శక్తి ఆలయం, మంచినీటి గుంట, ప్రాథమిక పాఠశాల, నెత్తం కండ్రిగ వద్ద ఉన్నత పాఠశాల, వికేఆర్ దేశమ్మ దేవస్థానం ఆర్చి, చర్చిలకు సంబంధించిన బాధితులతో సమావేశమైన ఆర్డీవో జాతీయ రహదారికి సంబంధిత అధికారులు, తహశీల్దార్, సర్వేయర్ సమక్షంలో విడివిడిగా పిలిచి చర్చించారు. ఓంశక్తి ఆలయం ప్రభు త్వ భూమిలో కట్టివున్నందున నిర్మా ణ ఖర్చులు మాత్రమే చెల్లిస్తా మన్నారు. హైవే నిబం ధ నల మేరకు ఎవరె వరికి ఎంత నష్ట పరిహారం చెల్లించాల్సి వస్తుందో ఆ పరిహారం తప్పకుండా చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రవికుమార్, సర్వేయర్ సురేష్, బాధితులు పాల్గొన్నారు.